క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మాజీ సర్పంచ్ జగన్‌నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 5 లక్షల సీఆర్ఆర్ ఎస్సీ కాంపోనేట్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దూలం సూలచన, పోచమ్మ, రవీందర్, కారోబార్ శ్రీకాంత్, రాంబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



రాజయ్యకు చెక్కు అందజేస్తున్న రేంజర్

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన పశు యజమాని గుర్రం రాజయ్యకు చెందిన లేగ దూడ గ్రామంలోని బొగ్గులవాగు సమీపంలో జూన్ నెలలో పెద్దపులి దాడికి మృతి చెందింది. దీంతో నివేదికను జిల్లా ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఈ మేరకు రూ.30 వేల చెక్కు మంజూరు కాగా కొయ్యూరు ఫారెస్ట్ రేంజర్ రాజేశ్వర్‌రావు రేంజ్ కార్యాలయంలో బాధితుడికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి ఎంఏ ఇంతియాజ్, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియామకం



భూపాలపల్లి రూరల్: బీజేపీ భూపాలపల్లి అర్బన్ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బండారి లోకేశ్‌యాదవ్‌ను నియమించినట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు గీస సంపత్ శనివారం పేర్కొన్నారు. తనను పార్టీ అర్బన్ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు నాయకులకు లోకేశ్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

పంటరుణాలు రెన్యువల్ చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం జంగేడు పీఏసీఎస్ పరిధిలో క్రాప్‌లోన్లు తీసుకున్న రైతులు సెప్టెంబర్ 15 లోపు వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సీఈఓ చల్ల రవీందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువులోపు రెన్యువల్ చేసుకున్న వారికి 58 పైసలు వడ్డీ వర్తిస్తుందని, రెన్యువల్ చేసుకుంటే 13.75 పైసలు పడుతుందని తెలిపారు.

పరామర్శ

రేగొండ: మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన సకినాల నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్ పరామర్శించి, రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట కోలేపాక భిక్షపతి, సామల పాపిరెడ్డి, చంద్రకర్ రెడ్డి, పసుల రత్నాకర్, గౌస్‌పాషా, తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై జాగ్రత్తగా ఉండాలి

కాటారం: వసతి గృహాల్లో ఉండే విద్యార్థినులపై జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ బాబు, ఎస్సై శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని శనివారం ఎంపీడీఓ బాబు, ఎస్సై శ్రీనివాస్ సందర్శించారు. వసతిగృహం పరిసరాలు, సౌకర్యాలు, స్టోర్‌రూం, వంటగది, డైనింగ్‌హాల్, స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్డెన్ భవానికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన భోజనం అందేలా చూసుకోవాలన్నారు.

గ్యానం సారయ్య ఆశయ సాధనకు కృషి

వెంకటాపురం(కె): సీపీఎం దివంగత నాయకుడు గ్యానం సారయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు బందారు రవి కుమార్, సూడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్యానం సారయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి సాంబశివ, నాయకులు వెంకటరెడ్డి, గ్యానం వాసు, రాజేందర్, కుమ్మరి శ్రీను, చిట్టెం ఆదినారాయణ, నర్సింహాచారి ఉన్నారు.

కల్వర్టులతో కష్టాలు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కల్వర్టుపై వరదలో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

చిట్యాల: మండల కేంద్రం నుంచి టేకుమట్లకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని శాంతినగర్ గ్రామ శివారులో లో-లెవల్ కల్వర్టుపై వరద రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలతో వెలిశాల గుట్టపై భాగం నుంచి వచ్చిన వర్షపు నీటితో కల్వర్టు ఉధృతంగా ప్రవహించింది. దీంతో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన వాహనదారులు కల్వర్టుపై రాకపోకలకు అనేక అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది.

ప్రారంభం కాని పనులు

రేగొండ మండలం నుంచి టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి వరకు లో లెవల్ కల్వర్టులను హై లెవల్ కల్వర్టుల నిర్మాణం కోసం రూ.రెండు కోట్ల నిధులతో శాంతినగర్ శివారులో గల లో లెవల్ కల్వర్టు పక్కనే పనులకు గత సంవత్సరం ఎమ్మెల్యే సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. కానీ పనులకు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే కల్వర్టులు నిర్మాణం చేయడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా కల్వర్టుల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

భయం వేస్తోంది



వర్షాకాలం వచ్చిందంటే కల్వర్టుల మీదుగా ప్రయాణం చేయలంటే భయం వేస్తోంది. రాళ్లతో ఉన్న కల్వర్టుల మీదుగా వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఆందోళన చేందాల్సిన పరిస్థితి. కావున కనీసం సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుల నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.

\- మధుకర్, డ్రైవర్, టేకుమట్ల

హై లెవల్ కల్వర్టులు నిర్మించాలి



చిట్యాల నుంచి టేకుమట్ల మండలాల మధ్య ఉన్న లో లెవల్ కల్వర్టులను హై లెవల్ కల్వర్టులుగా నిర్మాణం చేపట్టాలి. వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల కురిసిన వర్షానికి వరద తాకిడి ఎక్కువై చిట్యాలకు టాటా ఏసీ వాహనంలో ప్రయాణికులతో పోవాలంటే వెళ్లలేక పోయా.

-కోలిపాక రాజు, డ్రైవర్, పెద్దంపల్లి

విద్యా విధానం పటిష్టానికి చర్యలు



కాటారం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాధిక



చిట్యాలలో..

- ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక

కాటారం: అంగన్‌వాడీకేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యా విధానం పటిష్టపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని దేవరాంపల్లి, అల్లీపూర్‌తో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రారంభ బాల్య సంరక్షణ విద్యా విధానం(ఈసీసీఈ డే) కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశ పెట్టిన ప్రీ ప్రైమరీ విద్యా విధానంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ విద్య చిన్నారులకు ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు వీణ, శివరాణి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలతరెడ్డి, కమలాదేవి, మణిమాల, రజిత, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1, క్రోసూర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్య, సుజాత ఆధ్వర్యంలో శనివారం ఈసీసీఈ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ప్రతీ నెల నాలుగో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా లావణ్య, తల్లులు దాసారపు శిరీష, శీలపాక వనిత, రమ్య, సౌజన్య, శ్రీలత, పూజ, నమిత, స్వాతి పాల్గొన్నారు.

పాఠశాలలో పచ్చదనాన్ని పెంపొందించాలి

- ఎంఈఓ రఘుపతి



మాట్లాడుతున్న రఘుపతి

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతో పాటు, పచ్చదనాన్ని పెంపొందించి విద్యార్థులకు ఆహ్లాదవాతావరణాన్ని కల్పించాలని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ ర్యాంకింగ్‌పై మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన అనుకూల వాతావరణాన్ని కల్పించాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ బెంచ్ మార్కులకు అనుగుణంగా మెరుగు పరిచేందుకు ఒక రేటింగ్ వ్యవస్థ పరిశుభ్రత, ఆకుపచ్చ పద్ధతుల రాయబారులుగా పిల్లలను తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతి, మహేందర్, శ్రీనివాస్, శ్రీలత, రవీందర్, ఎమ్మార్సీ సిబ్బంది హరీష్, నరేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మల్హర్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



టేకుమట్ల: వెలిశాల ఉన్నత పాఠశాలలో..



మహదేవపూర్ ఎమ్మార్సీ వద్ద..

మల్హర్/టేకుమట్ల/కాళేశ్వరం: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్హర్ మండలంలోని వల్లెకుంట జిల్లాపరిషత్ పాఠశాలలో, టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో, మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ.. చేపట్టే నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ములుగు రూరల్: యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని డీఎస్పీ రవీందర్ అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించిన ఆయన హాజరై ప్రారంభించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వినాయక్, వెంకటేష్, శ్రావణ్, కిషోర్, రంజిత్, రాహుల్, ప్రదీప్, సందీప్, వంశీ, జశ్వంత్, నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతులు



వంతెనపై చేపడుతున్న మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..

మల్హర్: జిల్లా సరిహద్దు మానేరుపై నిర్మించిన అడవి సోమన్‌పల్లి వంతెనకు పెద్దపల్లి ఆర్‌అండ్‌బీ అధికారులు పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను చేపడుతున్నారు. ఈనెల 7న 'ప్రమాదకరంగా వంతెన' అనే కథనాన్ని 'సాక్షి'లో ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో అడవి సోమన్‌పల్లి వంతెనపై గుంతలు ఏర్పడి చువ్వలు తెలిన ప్రదేశంలో 10 రోజులుగా పనులు చేయిస్తున్నారు. కాంట్రాక్టర్ పాత పట్టిలను తొలగించి, కొత్త చువ్వలు ఏర్పాటు చేయడంతో పాటు గుంతలు లేకుండా సీసీ వేస్తున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేనున్నారు.

స్కూల్ బస్సులు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన బస్సులను శనివారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు రావడానికి రవాణ సౌకర్యం కోసం బస్సులను ఏర్పాటు చేసినట్లు జీఎం తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా ప్రతీ రోజు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి, పాఠశాల కరస్పాండెంట్ మారుతి, ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి కృత్యమేళా..



మాట్లాడుతున్న ఎంఈఓ కుమారస్వామి

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కృత్య మేళాను మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు సులభంగా అవగాహన కల్పించడానికి ఉపయోగించే కృత్యాలతో హాజరై మేళా నిర్వహించారు. ఈ కృత్య మేళాను తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సురేందర్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. బోధనోపకరణలను పరిశీలించి, తరగతి గదిలో వాటిని ఉపయోగించే తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి, భాగ్యశ్రీ, ప్రవీణ్, విజయ భాస్కర్ ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు



హనుమాన్ నగర్‌లో పూజ కార్యక్రమంలో భక్తులు

భూపాలపల్లి అర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం వినాయక మండపాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నానో ఎరువులతో పర్యావరణానికి మేలు

- మండల వ్యవసాయ అధికారి శ్రీజ



రైతులకు అవగాహన కల్పిసున్న ఏఓ శ్రీజ

మల్హర్: నానో ఎరువుల వాడకంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీజ అన్నారు. శనివారం మండలంలోని కొయ్యూరు గ్రామంలో రైతులకు నానోఎరువుల వాడకంపై, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ఏఓ అవగాహన కల్పించారు. నానో ఎరువులు ఆధునిక వ్యవసాయ రంగంలో ఒక విప్లవాత్మక ఆవిష్కరణ అని ఇవి సంప్రదాయ ఎరువుల మాదిరిగా కాకుండా, నానో టెక్నాలజీ ఆధారంగా తయారవుతాయన్నారు. ఈ ఎరువులు సాధారణంగా ద్రవ రూపంలో తయారు చేసి, పంట ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. నానో ఎరువులు మొక్కలకు అవసరమైన పోషకాలను సకాలంలో అందిస్తాయని తెలిపారు.

విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

- బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

కాటారం: మహాముత్తారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి పట్టవా అని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ప్రశ్నించారు. బీజేపీ నాయకులతో కలిసి పూర్ణచందర్ శుక్రవారం రాత్రి బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ.. హాస్టల్ కొన్నేళ్లుగా పురాతన భవనంలో కొనసాగుతుందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బెడ్స్ లేకపోవడంతో విద్యార్థులు నేలపై పడుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు, 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ నాయకులు చేసింది శూన్యమని విమర్శించారు. హాస్టల్ నూతన భవనం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ నాయక్, డాక్టర్ రఫీ, లింగమల్ల సదువలి, నరేశ్, రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



కాళేశ్వరం: సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు



కాటారం: మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కాటారం: గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్లపై శనివారం కాటారం, మహాముత్తారం మండల కేంద్రాలోన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో పలు రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారిగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలను పార్టీ నాయకులకు తెలియపర్చి అభ్యంతరాలను స్వీకరించారు. సవరణల అనంతరం తుది జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశాల్లో కాటారం ఎంపీడీఓ బాబు, మహాముత్తారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ వీరస్వామి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయపార్టీలతో సమావేశం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాదారావుపేటలో ప్రత్యేక గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గూడూరు పెద్ద చెరువు నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ కోసం మండలంలోని జాదారావుపేటలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. చెరువు పునరుద్ధరణ కోసం 3.23 ఎకరాల భూమి అవసరం ఉండగా సభలో నిర్వాసిత రైతుల వివరాలు చదివి వినిపించారు. రైతులు భూ సేకరణకు సహకరించాలని తహసీల్దార్ నాగరాజు కోరారు. కాగా రైతులు అభ్యంతరాలను వెల్లడించారు. ఎక్కువ భూమి కోల్పోతున్నప్పటికీ రికార్డుల్లో తక్కువ భూమి నమోదు చేశారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నత అధికారులకు సమస్యలను నివేదించి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ గ్రామసభలో భూ సేకరణ విభాగం ప్రత్యేక నయాబ్ తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈఈ, గిర్దవర్, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి

- తహసీల్దార్ సునీత



మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

మొగుళ్లపల్లి: కులాలలకు, మతాలకు అతీతంగా ప్రజలు జీవించాలని తహసీల్దార్ సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంటరానితనం, అమనూషంపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల బండి చక్రాలు చోరీ



చక్రాలు లేకుండా ఉన్న ఎడ్ల బండి

కాటారం: మహాముత్తారం మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. మండలంలోని బోర్లగూడెంలో వరుస దొంగతనాలకు పాల్పడగా తాజాగా యామన్‌పల్లిలో సైతం చోరీ చేశారు. జిముడ సారయ్యకు చెందిన ఎడ్ల బండి చక్రాలను శనివారం తెల్లవారుజామున దొంగలించారు. దుండగులు ఇనుప చక్రాలను తీసుకెళ్లి బండిని వదిలివేసినట్లు బాధితుడు సారయ్య తెలిపారు. చోరీకి గురైన చక్రాల విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.